క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



హోంమంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న సీఐ

కోవూరు : రాష్ట్ర హోంమంత్రి అనిత తిరుమలకు వెళ్తూ మార్గమధ్యలో కోవూరులోని హోటల్ గ్రాండ్ వద్ద బుధవారం కొద్దిసేపు ఆగారు. ఈ క్రమంలో కోవూరు సీఐ శ్రీనివాసరావు, ఎస్సై రంగనాథ్‌గౌడ్ ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

వాహనాల తనిఖీ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని జొన్నవాడ సెంటర్‌లో ఏఎంవీఐ స్వప్నిల్‌రెడ్డి, ఆర్టీసీ అధికారులు సంయుక్తంగా వాహన తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాల్లేని పలు వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులు తమ వెంట డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు, వాహనానికి సంబంధించిన అన్నిపత్రాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తపాల బీమాపై అవగాహన కల్పించండి



స్థానికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఇందుకూరుపేట : తపాల జీవిత బీమా పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని తపాల శాఖ ఎస్పీఎండీ సాయికుమార్ సూచించారు. మండలంలోని ఇందుకూరుపేట తపాలశాఖ కార్యాలయంలో ఉద్యోగులకు తపాల జీవిత బీమా పాలసీ కార్యక్రమంపై ప్రేరణ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తపాల శాఖలో ఉన్న డీపీఓ సర్వీసెస్, ఎస్బీ, ఆర్డీ, టీడీ, సుకన్య, పీపీఎఫ్ వంటి పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సీహెచ్ వెంకయ్య, ఆర్.రాజేష్, స్థానిక సిబ్బంది వై.సుధాకర్, మస్తాన్, హేమలత, రేవతి, బాబులు, అబ్దుల్, వేమయ్య, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

విడవలూరు : మండల నూతన తహసీల్దార్‌గా కె.చంద్రశేఖర్ స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు వీఆర్వోలు, సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.

పేదింటి యువతికి ఆర్థిక సాయం




పొదలకూరు : పేదింటి యువతి వివాహానికి ఆంధ్రప్రదేశ్ రూరల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ వారు రూ.50 వేల ఆర్థిక సాయం అందించి ఆదుకున్నారు. పట్టణంలోని పద్మావతి నగర్‌లో నివాసం ఉంటున్న బందా రంగయ్య–వెంకటరమణమ్మ దంపతులకు ముగ్గురు ఆడబిడ్డలు. వీరి పెద్దమ్మాయి వివాహం జరిపేందుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డురావడంతో స్థానికంగా ఉంటున్న ఏపీఆర్‌డీ ఆర్గనైజేషన్ రాష్ట్ర అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ టి.వెంకటేశ్వర్లు చొరవ తీసుకున్నారు. ఆ శాఖ సౌత్ జోన్ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి రూ.50 వేల నగదు మంజూరు చేశారు. దీనిని వెంకటేశ్వర్లు బుధవారం వారికి అందజేశారు.

రాఘవరెడ్డి సేవలు మరువలేనివి



పొదలకూరు : దివంగత మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గోసు రాఘవరెడ్డి విలువలతో కూడిన రాజకీయం చేశారని, ఆయన సేవలు మరువలేనివని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని లింగంపల్లిలో రాఘవరెడ్డి వర్ధంతి సభలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొదలకూరు సర్పంచ్‌గా ఆయన అందించిన సేవలు మంచి గుర్తింపు తెచ్చిపెట్టినట్లు తెలిపారు. ముందుగా పట్టణంలో ప్రధానమంత్రి ఈ–స్టోర్‌ను సోమిరెడ్డి ప్రారంభించారు. ఇక్కడ 20 శాతం తక్కువ ధరలకు అన్నిరకాల వస్తువులు లభ్యమవుతాయని చెప్పారు. రాఘవరెడ్డి సతీమణి గోసు శ్యామలమ్మ, బోగోలు భాస్కర్‌రెడ్డి, పార్థసారథిరెడ్డి, మస్తాన్‌బాబు, మల్లికార్జున్‌నాయుడు, ఆదాల సుగుణ పాల్గొన్నారు.

ముంగిటకే రేషన్.. ఇక ఉండదు



- వచ్చే నెల నుంచి ఎండీయూ వాహనాల రద్దు
- నరుకుల కోసం షాపులకు వెళ్లాల్సిందే
- మజరా గ్రామస్తులకు ఇబ్బందులే
- వృద్ధులు, దివ్యాంగులకు కష్టకాలం

రెక్కాడితే గానీ డొక్కాడని దినసరి కూలీలు, గృహిణులు, వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ షాపుల వద్ద తిప్పలు లేకుండా చేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే నిత్యావసర సరుకుల పంపిణీ వ్యవస్థను ప్రవేశపెట్టారు. దీని ద్వారా ప్రతినెలా తొలి వారంలో ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందేవి. అయితే ఇంతటి గొప్ప వ్యవస్థను చంద్రబాబు ప్రభుత్వం రద్దు చేస్తామని ప్రకటించడంపై సర్వత్రా వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రజలకు మేలు చేసే వ్యవస్థలపై కక్ష ఎందుకని ప్రశ్నిస్తున్నారు.



ఎండీయూ వాహనాల ద్వారా ఇళ్ల వద్ద బియ్యం పంపిణీ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

పొదలకూరు : గత ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ సరుకులను పంపిణీ చేయాలనే సదుద్దేశంతో ఎండీయూ(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనాలను ఏర్పాటు చేసింది. 2021 ఫిబ్రవరిలో అప్పటి జగన్ ప్రభుత్వం ఎండీయూ వాహనాలను అట్టహాసంగా ప్రారంభించింది. అప్పట్లో సర్వేపల్లి నియోజకవర్గంలో ఐదు మండలాలకు కలిపి 53 ఎండీయూ వాహనాలను కేటాయించారు. ఈ పథకం ముఖ్య ఉద్దేశం నిరుద్యోగులకు జీవనోపాధి కల్పించడంతో పాటు, మజరా గ్రామాలు, ఇళ్లకు రేషన్ సరుకులను అందజేయడమే. ఈ క్రమంలో వాహనాల ద్వారా విజయవంతంగా ఇళ్ల వద్దకు బియ్యం, ఇతర రేషన్ సరుకులను అందజేస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జూలై నెల వరకు సరుకులను అందజేసి తర్వాత ఇంటింటికీ రేషన్ సరుకుల అందజేత కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ప్రజోపకరమైన పథకాన్ని ఎందుకు రద్దు చేయాల్సి వచ్చిందని పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఒక ఊరి నుంచి మరొక ఊరికి రేషన్ సరుకుల కోసం వెళ్లాల్సిన బడుగు, బలహీన వర్గాల వారు ఇబ్బందులు పడతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్‌షాపుల నుంచి 2 నుంచి 3 కి.మీ దూరం ఉన్న గ్రామాలు కూడా ఉన్నాయి. పొదలకూరు పట్టణంలో రేషన్‌షాపులు ఉండగా మజరా గ్రామాలైన చిట్టేపల్లి, లింగంపల్లి, వెంకటేశ్వరపురం వాసులు పట్టణంలోని షాపులకు వచ్చి బియ్యం తీసుకు వెళ్లాల్సి ఉంటుంది.

వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందులే

ఒంటరిగా ఉంటున్న వృద్ధులు, దివ్యాంగులకు ఎండీయూ వాహనాల రద్దు వల్ల తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. పట్టణాల్లో సైతం ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బియ్యం మోసుకుని రావాలంటే సమస్యగా మారుతుంది. పేద వర్గాలకు చెందిన వారు ఆటోలు, రిక్షాల్లో చార్జీలు చెల్లించి బియ్యాన్ని ఇళ్లకు తరలించుకునే పరిస్థితి ఉండదు. ఇప్పటి వరకు ఎండీయూ వాహనం ఆయా ప్రాంతాలకు వెళ్లి సైరన్ మోగించి మరీ అప్రమత్తం చేసి రేషన్ సరుకులను అందజేయడం జరిగేది. ఇకపై అలాంటి పరిస్థితి ఉండదనే సమాచారం తెలియడంతో వృద్ధులు డీలాపడిపోతున్నారు. కూటమి ప్రభుత్వం భారం తగ్గించుకునేందుకే ఎండీయూ వాహనాలను రద్దు చేస్తున్నట్లుగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పనులకు వెళ్లొచ్చేలోగా షాపులు ఉండవు



దినసరి కూలి పనులకు వెళ్లే మాలాంటి వాళ్లకు రేషన్ సరుకులు తెచ్చుకోవడం కష్టం. ఇప్పటివరకు ఎలాంటి కష్టాలు లేకుండా రేషన్ సరుకులు అందాయి. ఇకపై రేషన్ షాపులకు వెళ్లాలని చెబుతున్నారు. మేము కూలి పనులకు వెళ్లి వచ్చేసరికి రేషన్ షాపులు ఉండవు. దీనివల్ల మాకు ఎంతో నష్టం.

– జయమ్మ, పడుగుపాడు, కోవూరు

కోవూరు నియోజకవర్గంలో..	
ఎండీయూ వాహనాల సంఖ్య	63
రేషన్ షాపుల సంఖ్య	200
రేషన్‌కార్డుల సంఖ్య	83,136

సర్వేపల్లి నియోజకవర్గంలో..	
ఎండీయూ వాహనాల సంఖ్య	53
రేషన్ షాపుల సంఖ్య	205
రేషన్‌కార్డుల సంఖ్య	91,371

బడుగులకు పెద్ద షాకే..



ఎండీయూ వాహనాలను రద్దు చేయడం బడుగు, బలహీన వర్గాలకు పెద్ద షాక్ లాంటిదే. కూలీనాలీ చేసుకునే వారు పనులు మానుకుని రేషన్ షాపుల వద్దకు వెళ్లి సరుకులను తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఎండీయూ వాహనాల ద్వారా ఇళ్ల వద్దకే బియ్యం, సరుకులను తీసుకొచ్చి అందజేసే పథకం ఎంతోగానో ఉపయోగపడుతోంది. ఇదే పద్ధతిని పాటిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

– మల్లిక చిట్టెమ్మ, సర్పంచ్, పొదలకూరు

కాలనీల నుంచి షాపులకు వెళ్లలేరు



ఎస్సీ, ఎస్టీ కాలనీలు గ్రామాల్లో కొంత దూరంగా ఉంటాయి. అక్కడి నుంచి షాపులకు నడిచి వెళ్లి బియ్యం మోసుకుని ఇళ్లకు రావడం పెనుభారంగా మారుతుంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కష్టాలను గుర్తించి ఎండీయూ వాహనాలను ప్రవేశపెట్టారు. వృద్ధులు, దివ్యాంగులు ఇకపై పడే కష్టాలను వర్ణనాతీతం అవుతుంది.

– జి.శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యుడు, బిట్–4, పొదలకూరు

రేషన్ కోసం కూలి వదులుకోవాలి



రేషన్ సరుకులు వ్యాన్ ద్వారా ఇంటింటికీ వచ్చి ఇవ్వడం చాలా మేలు. కూలి పనులకు వెళ్లే మాలాంటి పేదలకు ఇది చాలా అనుకూలం. సరుకుల కోసం రేషన్ డీలర్ వద్దకు వెళ్లడమంటే ఒక కూలి నష్టపోవాల్సి వస్తుంది. వ్యాన్ ద్వారా సరుకులు ఇచ్చే విధానం కొనసాగించాలి.

– బట్టేపాటి మాధవయ్య, ఈపూరు, ముత్తుకూరు మండలం

రేషన్‌షాప్ కోసం ఆరు కిలోమీటర్లు నడవాలి



ఇంటింటికీ వచ్చే రేషన్ బియ్యాన్ని రద్దు చేస్తామని అనడం సీఎం చంద్రబాబుకు సబబు కాదు. ప్రతినెలా రేషన్ బియ్యం మా ఇంటి ముందుకు వచ్చేవి. ఇప్పుడు విడవలూరులోని రేషన్ షాపుకు వెళ్లి తెచ్చుకోవాలంటే రానుపోను ఆరు కిలోమీటర్ల దూరం నడవాలి. ఈ వయస్సులో అంతదూరం వెళ్లి బియ్యం తెచ్చుకునే స్తోమత, శక్తి మాకు లేదు. దయచేసి చంద్రబాబు తన నిర్ణయాన్ని మార్చుకుంటే బాగుంటుంది.

– తలపాల గోవిందమ్మ, యలగాలమ్మ గుంట, విడవలూరు

రాజకీయ కారణాలతోనే..



ఎండీ వెహికల్స్ ద్వారా ఎటువంటి పక్షపాతానికి తావు లేకుండా రాజకీయాలకు అతీతంగా రేషన్ సరుకులను సరఫరా చేశాం. అయితే ప్రభుత్వం మారాక మమ్మల్ని పట్టించుకోవడం మానేశారు. రాజకీయ కారణాలతోనే ఇలా చేసినట్లు అర్థమవుతోంది.

– పి.శివరామకృష్ణ, ఎండీయూ వెహికల్ నిర్వాహకుడు, మనుబోలు దళితవాడ

వారి పొట్టకొట్టడం అన్యాయం



ఎండీ వెహికల్స్ నిర్వాహకులకు రాజకీయాలతో ఏమి సంబంధం? ప్రభుత్వం మారినంత మాత్రాన వారిని కూడా మార్చాలనుకోవడం సబబు కాదు. రాజకీయ కారణాలతో వారి పొట్టకొట్టడం మంచిది కాదు. దీనివల్ల దినసరి కూలీలు, మహిళలు నష్టపోతారు. వారికి న్యాయం చేసే బాధ్యత ప్రభుత్వానిది.

– ఎ.తులసీరాం, జట్లకొండూరు, మనుబోలు

ఈ వయస్సులో పడిగాపులు ఎలా?



జగనన్న పాలనలో ఇంటి వద్దకే రేషన్ సరుకులు వచ్చేవి. ఇకపై రేషన్ బండి రాదంటున్నారు. వయోభారంతో బాధపడే మాకు రేషన్ సరుకులు ఎవరు తెచ్చిస్తారు. ఈ వయస్సులో రేషన్ షాపుల వద్ద పడిగాపులు మా వల్ల కాదు.

– చౌటూరు ధనమ్మ, చంద్రమౌళినగర్, కోవూరు

కూటమి ప్రభుత్వంతో కష్టాలు



కూటమి ప్రభుత్వంలో కొత్త పథకాలతో ప్రజలకు మేలు జరుగుతుందని భావించాం. అయితే వారి వల్ల కొత్త కష్టాలు మొదలవుతున్నాయి. ఇంటి వద్దకే వచ్చే రేషన్ వాహనాలను నిలిపివేయడం సరికాదు. కూలి పనులకు వెళ్లే వారు రేషన్ షాపులకు వెళ్లి సరుకులను తెచ్చుకోవడం కష్టం.

– జానకి, పడుగుపాడు, కోవూరు మండలం

ఎంతో భారం



సైరన్ వేసుకుని ఇంటి ముందుకు వచ్చి సరుకులు ఇచ్చి వెళ్లే వాహనాలను నిలిపివేస్తామడం మంచిది కాదు. దీనివల్ల మహిళలు, కూలి పనులకు వెళ్లే వారికి ఇబ్బందులు తప్పవు. చాలా దూరంగా ఉండే రేషన్ షాపులకు వెళ్లి సరుకులు తెచ్చుకోవడం మాలాంటి వారికి ఎంతో భారం అవుతుంది.

– హైమావతి, చంద్రమౌళి నగర్, పడుగుపాడు, కోవూరు

ఈ–పంట నమోదు తప్పనిసరి



కోవూరు : పంట నమోదును పరిశీలిస్తున్న డీఏఓ సత్యవాణి



విడవలూరు : పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఓ వెంకట కృష్ణయ్య

కోవూరు : రైతులు ఈ–పంట నమోదును తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) సత్యవాణి కోరారు. మండలంలోని పాటూరు, గుమ్మలదిబ్బ, ఇనమడుగు గ్రామాల్లో ఆమె బుధవారం పరిశీలించారు. ఈ–పంట నమోదులో సాంకేతిక సమస్యలు ఉన్నాయా.. అని ఆరాతీశారు. రైతులందరూ ఈ–పంట నమోదు చేయించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఓ ఇందిరావతి, గ్రామ వ్యవసాయ సహాయకులు మెహరున్నీసా, చైతన్య, స్వేత తదితరులు పాల్గొన్నారు.

ఏఓ పరిశీలన

విడవలూరు : విడవలూరు గ్రామంలోని పలువురు రైతుల పంట పొలాలను మండల ఏఓ పి.వెంకట కృష్ణయ్య బుధవారం పరిశీలించారు. పంటలో కాండం తొలుచు పురుగు అధికంగా ఉందని, నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతులు ఈ–పంట నమోదు చేసుకోవాలని కోరారు.

ఘనంగా ఆజాదీకా అమృత్



మనుబోలు : ఆజాదీకా అమృత్ మహోత్సవాన్ని మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఎంపీపీ గుండాల వజ్రమ్మ, ఎంపీడీఓ ప్రసాద్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య సంగ్రామ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఏఓ రవికుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు చెంచుప్రసాద్, రేష్మాసోని, కృష్ణవేణి, శ్రావణి, అనితమ్మ, శీనయ్య, రాజేశ్వరి, డీఓ దీపిక పాల్గొన్నారు.

మండల సమావేశం 14న

ముత్తుకూరు : ముత్తుకూరు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 14వ తేదీన జరుగుతుందని ఎంపీడీఓ లక్ష్మణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం జరుగుతుందని, సభ్యులు, అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

పన్నులను విధిగా చెల్లించాలి



పంచాయతీ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ రమణబాబు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ ప్రజలు విధిగా పన్నులు చెల్లించి అభివృద్ధికి దోహదం చేయాలని కమిషనర్ రమణబాబు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని సిబ్బందితో కలిసి ఆయన బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి పన్ను, కుళాయి పన్ను లేని ఇళ్లను గుర్తించి వెంటనే పన్ను వేయాలని సిబ్బందిని ఆదేశించారు. వ్యాపారాలు నిర్వహించే వారు తమ షాపులకు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. పన్నుల వసూలుపై ప్రతి మంగళవారం నగర పంచాయతీ కార్యాలయంలో సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. వందశాతం పన్నులు వసూలు చేసేలా సిబ్బంది దృష్టి సారించాలని వివరించారు. సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గోదాదేవికి ప్రత్యేక పూజలు



పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస నగర్‌లో ఉన్న శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో గోదా అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా దుర్గారావు–ఉత్తర దంపతులు వ్యవహరించారు.

ముర్రుపాలే బిడ్డకు తొలి టీకా

కొడవలూరు : ముర్రుపాలే బిడ్డకు తొలిటీకా అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ తెలిపారు. తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా మండలంలోని నార్తురాజుపాళెంలో తల్లిపాల ఆవశ్యకతపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం సీమంతాలు నిర్వహించారు. మహిళా పోలీస్ జి.అనూరాధ, వెల్ఫేర్ సహాయకులు పి.ప్రసన్న, ఏఎన్‌ఎంలు జి.సలోమి, డి.దీనమ్మ, అంగన్‌వాడీలు కె.విజయమ్మ పాల్గొన్నారు.

దామేగుంటలో..

మండలంలోని దామేగుంటలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల, అంగన్‌వాడీలు రమణమ్మ, జయశ్రీ, స్వర్ణలత, మాధవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డిపాళెంలో..

మండలంలోని వడ్డిపాళెంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఏఎన్‌ఎం బి.కీర్తి, అంగన్‌వాడీ కార్యకర్త ఎం.పద్మావతి పాల్గొన్నారు.

ముర్రుపాలలో అధిక పోషకాలు

విడవలూరు : బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టించడం ద్వారా అధిక పోషక లభిస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.రమణి తెలిపారు. మండలంలోని ముదివర్తి పంచాయతీ పరిధిలోని ఉపారతోపు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. మహిళా పోలీస్ లక్ష్మీరాజ్యం, అంగన్‌వాడీ టీచర్లు తిరుపతమ్మ, శారద, హేమలత, శీనమ్మ, రాజసులోచనమ్మ, లావణ్య పాల్గొన్నారు.

తల్లిపాలనే పట్టించాలి

పొదలకూరు : బిడ్డకు తల్లిపాలనే పట్టించాలని, ముర్రుపాలు బిడ్డకు యాంటీ బయోటిక్‌గా పని చేస్తాయని మహ్మదాపురం సెక్టార్ సూపర్‌వైజర్ సీహెచ్ ఆదినారాయణమ్మ అన్నారు. మండలంలోని తాటిపర్తి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లలకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఖాదర్‌బాషా, ఏఎన్‌ఎం కవిత, ఆశావర్కర్ లక్ష్మీకాంతమ్మ, అంగన్‌వాడీ టీచర్లు పుష్పవేణి, పద్మజా, వరలక్ష్మి, సుజాత, రోహిణి పాల్గొన్నారు.

- పట్టణంలోని నర్సారెడ్డి కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల విశిష్టతపై పొదలకూరు సెక్టార్ సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తల్లులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల టీచర్ అనిత, మహిళా పోలీస్ విజయలక్ష్మి, ఏఎన్‌ఎం కృష్ణమ్మ, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మీదేవి, రత్నమ్మ, మణెమ్మ, వెంకటకుమారి, అమరావతి, ఆశావర్కర్లు ఉషా, లక్ష్మి పాల్గొన్నారు.

అమృతంతో సమానం

మనుబోలు : తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. మండలంలోని కాగితాలపూరు అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కనీసం ఆరు నెలల పాటైనా బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలన్నారు. ఏఎన్‌ఎం జయరామమ్మ, ఎమ్‌ఎల్‌హెచ్‌పీ సుప్రజ, అంగన్‌వాడీలు విజయమ్మ, గౌరీ, రేవతి పాల్గొన్నారు.



కొడవలూరు : దామేగుంటలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ నిర్మల



మనుబోలు : కాగితాలపూరులో..

ప్రాముఖ్యతను తెలుసుకోవాలి

వెంకటాచలం : తల్లిపాల ప్రాముఖ్యత గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మజ సూచించారు. మండలంలోని తిక్కవరప్పాడులో తల్లిపాల ఆవశ్యకతపై బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. లేనిపోని అపోహలతో పిల్లలకు తల్లిపాలను దూరం చేసి డబ్బా పాలు తాగించడం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కొప్పోలు పద్మావతి, వై.యువన్య, అదానీ ఫౌండేషన్ సభ్యురాలు జాలాది అరుణ పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష

తోటపల్లిగూడూరు : బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ తోటపల్లిగూడూరు సెక్టార్ సూపర్‌వైజర్ రంగమ్మ అన్నారు. మండలంలోని పేడూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవ సంబరాలు బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే సుజాత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

ముత్తుకూరు : పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుబ్బమ్మ అన్నారు. మండలంలోని పంటపాళెం–2 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ఆవశ్యకతపై బుధవారం అవగాహన కల్పించారు. తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సుజన, పోలమ్మ, మంజుల పాల్గొన్నారు.



విడవలూరు : గర్భిణులకు అవగాహన



వెంకటాచలం : తిక్కవరప్పాడులో..



పొదలకూరు : తాటిపర్తిలో..



తోటపల్లిగూడూరు : పేడూరులో..



ముత్తుకూరు : మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సుబ్బమ్మ